జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# బెజ్జాలలో ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

## రైతులకు అండగా నిలవాలని సర్పంచ్ స్రవంతి పిలుపు



**జైపూర్, మే 3,(జర్నలిస్ట్ డైరీ) :**
జైపూర్ మండలం బెజ్జాల గ్రామపంచాయతీ పరిధిలో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల స్రవంతి రాజ నర్సయ్య పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర పొందాలని సూచించారు. రైతు సంక్షేమమే తమ ధ్యేయమని, కొనుగోళ్లు పారదర్శకంగా సాగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేముల స్రవంతి నాగరాజు, గ్రామ నాయకులు తాటి జైపాల్ గౌడ్, బద్రిరాజు మల్లయ్య, యువ నాయకులు బద్రి హరీష్, పూసాల సాయి కుమార్, పొయిల కిరణ్, వాల అభిలాష్, వీవొ అధ్యక్షురాలు, అర్జులరాణి, పొయిల రాజేశ్వరి, హమాలీ సంఘం నాయకులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి

## జిల్లాలో 97 శాతం హాజరు! నీట్ పరీక్షకు 465 మంది హాజరుఏర్పాట్లను అడిగి తెలుసుకున్న ఆర్డీవో రమాదేవి





**మెదక్ జిల్లా ,(జర్నలిస్ట్ డైరీ) :**మెదక్ జిల్లాలో నిర్వహించిన నీట్ పరీక్ష ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరిగిందని అదనపు కలెక్టర్ నగేష్ , మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారుఆదివారం జిల్లాలో నీట్ పరీక్ష జరుగుతున్న మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, నీట్ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు,ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు బయోమెట్రిక్ వినియోగించిన విధానాన్ని పరిశీలించి...అలాగే పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరు అయ్యారు ,గైర్హాజరు శాతం వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారుఈ పరీక్షకు మొత్తం 479 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 465 హాజరయ్యారని, 14 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి అంతరాయం, సమస్యలు ఉత్పన్నం కలుగకుండా ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని తెలిపారు . పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాల నిఘాతోపాటు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.పరీక్ష పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా ఇతరులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు.మెదక్ ఆర్డీవో రమాదేవి నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు .ఆర్డీవో వెంట తాసిల్దార్ లక్ష్మణ్ బాబు నీట్ పరీక్ష కేంద్ర నిర్వాహకులు ఇతర పోలీసు అధికారులు, నీట్ , ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం-తడిసిన ధాన్యం..

**మందమర్రి 0మే3: (జర్నలిస్ట్ డైరీ) :**
అన్నదాతలు కష్టించి పండించిన వరి ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దైంది.కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షానికి నీటి పాలైంది.మందమర్రి పట్టణం,మండలంలో ఆదివారం మధ్యాహ్నం గాలి దుమారం వీయడం దీనికి అకాల వర్షం తోడు కావడంతో సుమారు గంట సమయం పాటు బారి వడగళ్ల వర్షం కురిసింది. భారీ వర్షానికి కళ్ళ ముందు తడుస్తున్న వరి ధాన్యాన్ని చూస్తూ రైతన్నలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు.మండలం లోని బొక్కలగుట్ట, సారంగపల్లి,పొన్నారం, గుడిపెల్లి,వెంకటాపూర్ లలో వారం రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కాంటాలు ఏర్పాటు చేయక,ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని రైతులు వరి కోతలు చేపట్టి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించగా కొద్ది మంది రైతులు కల్లాల్లోనే వరి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కాస్తా వర్షార్పణం అయ్యింది.రైతులు వారం రోజుల క్రితం ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి అరబెట్టినప్పటికీ వర్షంలో ధాన్యం తడిసి పోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు.ప్రభుత్వం స్పందించి అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ధన్యవాదాలు చెప్పడం మర్చిపోయామా?



మన తెలుగు సంస్కృతి మనకు నేర్పిన ఈ గొప్ప సంపదను, ఆ కృతజ్ఞతా భావాన్ని మళ్ళీ మన రక్తంలోకి తీసుకువద్దాం. కృతజ్ఞతను ఒక సంప్రదాయంగా కాకుండా, ఒక జీవన సూత్రంగా స్వీకరించాల్సిన సమయం ఆసన్నమైంది. చాలామంది కృతజ్ఞతను ఒక బలహీనతగా చూస్తారు. ఎవరికీ రుణపడకూడదు,మన బతుకు మనదే అనే స్వతంత్ర భావన నేటి కాలంలో పెరిగింది. కానీ, వాస్తవానికి ఒకరికి కృతజ్ఞత తెలపడం అంటే మన అహంకారాన్ని (వస్త్రం) పక్కన పెట్టడం. అది ఒక బలహీనత కాదు, అది ఒక శక్తివంతమైన చర్య. ఎప్పుడైతే మనం మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్తామో, ఆ క్షణంలో మనలో ఉన్న నేను అనే అహంకారం తగ్గి, మనం అనే విస్తృత భావన మొదలవుతుంది. ఈ మార్పు మనిషిని మరింత మానవీయంగా మారుస్తుంది.శాస్త్రీయంగా చూస్తే, కృతజ్ఞత మన మెదడును పునర్నిర్మిస్తుంది (neuroplasticity). ప్రతికూల ఆలోచనల నుండి బయటపడటానికి ఇది ఒక సహజమైన మందులా పనిచేస్తుంది. మనం ప్రతిరోజూ గడిపిన రోజులో మంచి విషయాలను వెతికినప్పుడు, మన మెదడు నెమ్మదిగా కష్టాలను కాకుండా, అవకాశాలను వెతకడం మొదలుపెడుతుంది. మనం ఎప్పుడూ లేని దాని గురించి బాధపడతామో, అప్పుడు మన మెదడు భయం మరియు అసంతృప్తి అనే రసాయనాలను విడుదల చేస్తుంది. అదే, మనకు ఉన్నదానికి కృతజ్ఞత చెబితే, మనలో ఆనందం మరియు ప్రశాంతత కు కారణమయ్యే హార్మోన్లు విడుదలవుతాయి. ఇది మనిషిని మరింత ఆశావాదిగా (optimistic) మారుస్తుంది.జీవితంలో ఒడిదుడుకులు సహజం. కానీ, కృతజ్ఞత అనే కళ్ళద్దాలు మనకు ఉన్నప్పుడు, ఆ కష్టాల్లో కూడా ఏదో ఒక పాఠం కనిపిస్తుంది. ఉదాహరణకు, ఒక విఫలమైన ప్రయత్నం తర్వాత నేను ఓడిపోయాను అని అనుకునే బదులు, ఈ అనుభవం నాకు గొప్ప పాఠాన్ని నేర్పింది, అందుకు కృతజ్ఞత అని అనుకుంటే, అక్కడే మన ఎదుగుదల ప్రారంభమవుతుంది.

మనం పెద్ద పెద్ద సంఘటనలు జరగాలని వేచి చూడక్కర్లేదు. చిన్న చిన్న విషయాల్లో కృతజ్ఞతను వెతకడం అలవాటు చేసుకోవాలి. ఉదాహరణకు, మీకు ఇష్టమైన కాఫీని రుచి చూసినప్పుడు ఆ క్షణానికి కృతజ్ఞత.ఆఫీసులో మీ పనిని గుర్తించినప్పుడు ఆ సహోద్యోగికి కృతజ్ఞత.ఎండలో కష్టపడి పనిచేసే ట్రాఫిక్ పోలీస్ వైపు చూసినప్పుడు, వారి సేవకు మనసులో కృతజ్ఞత.ఇలా చిన్న చిన్న విషయాలకు మనం స్పందించడం మొదలుపెడితే, క్రమంగా మన వ్యక్తిత్వం మారుతుంది. ఇది కేవలం మనకే కాదు, మన చుట్టూ ఉన్నవారికి కూడా మంచి వాతావరణాన్ని కల్పిస్తుంది. ఎవరైతే ఎదుటివారిని మెచ్చుకుంటారో, వారిని అందరూ ఇష్టపడతారు. కృతజ్ఞత అనేది ఒక మాగ్నెట్ లాంటిది అది మంచి వ్యక్తులను, మంచి అవకాశాలను మన వైపు ఆకర్షిస్తుంది.ముఖ్యంగా, నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియాలో చూసే మెరుపులు కాకుండా, నిజ జీవితంలో మనం అనుభవిస్తున్న చిన్న చిన్న ఆనందాలను మనం గౌరవించాలి. మీరు పడుకునే పరుపు, తలదాచుకునే ఇల్లు, కడుపునిండా తిండి ఇవి కోట్లాది మందికి అందని ద్రాక్షలు. మనకు అవి ఉన్నందుకు మనం అదృష్టవంతులం. ఈ విషయాన్ని గ్రహించడమే నిజమైన చైతన్యం.ముగింపుగా ఒక్క మాట: కృతజ్ఞత అనేది ఒక గమ్యం కాదు, అది ఒక నిరంతర ప్రయాణం. ఈ ప్రయాణంలో కష్టాలు రావచ్చు, కానీ కృతజ్ఞత అనే దీపం ఉన్నప్పుడు చీకటి భయపెట్టదు. మనల్ని మనం ప్రేమించుకుందాం, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, ప్రకృతిని, మనుషులను గుర్తించుకుందాం.రేపటి రోజున మళ్ళీ సూర్యోదయం అయినప్పుడు, ఈ కొత్త రోజు నా జీవితంలోకి వచ్చినందుకు ధన్యవాదాలు అని మనసులో అనుకోండి. ఆ రోజంతా మీ దృష్టిలో మార్పు వస్తుంది. మీరు ఎదుటివారిలో లోపాలు వెతకడం మానేసి, వారిలో ఉన్న మంచితనాన్ని చూడటం మొదలుపెడతారు. ఈ మార్పు మీ నుండే మొదలవ్వాలి. కృతజ్ఞతను ఒక అలవాటుగా కాకుండా, ఒక ఆభరణంగా ధరించండి. ఎందుకంటే, ఉన్నదానికి సంతోషపడటం నేర్చుకున్న వ్యక్తి ప్రపంచంలో అత్యంత సంపన్నుడు. ఈ సంపదను పంచుకోండి, ప్రపంచాన్ని మరింత అందంగా మార్చండి.

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

---

# దామగుండం అడవిలో వన్యప్రాణుల మారణహోమం: పట్టించుకోని అధికారులు!



**జర్నలిస్ట్ డైరీ,పుదూర్ మే 03**
వికారాబాద్ జిల్లా పూడూర్ మండల పరిధిలోని శ్రీ దామగుండం అటవీ ప్రాంతం మూగజీవుల పాలిట మృత్యుకుహరంగా మారుతోంది. రక్షణ కరువై వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నా అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కుక్కల దాడిలో చిక్కుతున్న వన్యప్రాణులు**
అటవీ ప్రాంతంలోని పిల్లర్ నంబర్ 83 సమీపంలో తాజాగా జింకలు, దుప్పులు, సాంబార్ల (సారంగలు) వంటి వన్యప్రాణులు విగతజీవులుగా పడి ఉండటం కలకలం రేపింది. అడవి కుక్కలు గుంపులుగా వచ్చి ఈ మూగజీవాలను వేటాడి చంపుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్ని వన్యప్రాణులు మరణించాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

**మృత్యుపాశంగా మారిన కాంపౌండ్ వాల్**
వన్యప్రాణుల మరణాలకు ప్రధాన కారణం అటవీ ప్రాంతం చుట్టూ సుమారు 25 కిలోమీటర్ల మేర నిర్మించిన కాంపౌండ్ వాల్ అని తెలుస్తోంది.
కుక్కల బారి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించే క్రమంలో, ఈ గోడ అడ్డుగా ఉండటంతో మూగజీవాలు బయటకు వెళ్లలేక అక్కడే కుక్కలకు చిక్కి ప్రాణాలు వదులుతున్నాయి.అడవి చుట్టూ రక్షణ కోసం కట్టిన గోడ ఇప్పుడు వన్యప్రాణులకు ఉరితాడుగా మారిందని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు.



**స్పందించని జిల్లా అధికారులు.. రంగంలోకి బిట్ ఆఫీసర్**
ఈ దారుణంపై జిల్లా స్థాయి అటవీ అధికారులకు సమాచారం అందించినా వారి నుంచి ఎటువంటి స్పందన కరువైంది. అయితే, స్థానిక బిట్ ఆఫీసర్ రాజు నాయక్ వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరణించిన వన్యప్రాణిని పరిశీలించి, దానిని తమ జీపులో తరలించారు.



క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను గమనిస్తున్నామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం," అని బిట్ ఆఫీసర్ పేర్కొన్నారు.అడవిలో ఇంకా ఎన్ని మూగజీవాలు ఇలా బలైపోయాయో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అడవి జంతువుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవ్యవస్థం

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున డిమాండ్

**నల్గొండ, మే03 (జర్నలిస్ట్ డైరీ) :**
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర అస్తవ్యస్తంగా నెలకొన్నదని, రైతులను పట్టించుకునే పరిస్థితి లేకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున విమర్శించారు. రైస్ మిల్లర్ల దోపిడి రోజురోజుకు పెరుగుతోందని, వెంటనే రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్గొండ మండలం చందనపల్లి గ్రామంలోని ఐకెపి కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడిన ఆయన, కొనుగోలు కేంద్రాల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. సీరియల్ విధానం పాటించకుండా, ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. తాలు పేరుతో ప్రతి క్వింటాల్‌కు 2 కిలోల 200 గ్రాములు కోత వేస్తున్నారని, అదీ కాక రైస్ మిల్లులకు ధాన్యం వెళ్లిన తర్వాత మరోసారి



లారీల వద్ద 5 నుంచి 10 క్వింటాళ్ల వరకు కోత వేయడం రైతులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని అన్నారు.రైతులు మాట్లాడుతూ ఒడ్లు ఎండబెట్టడం, ట్రాక్టర్ కిరాయిలు, కోత ఖర్చులు అన్నీ కలిపి ఖర్చులు అధికంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.2369 ఉన్నా, వాస్తవానికి వారికి కేవలం రూ.2000 మాత్రమే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.చందనపల్లి గ్రామంలో 225 మంది రైతులు నమోదు చేసుకున్నప్పటికీ, ఇప్పటివరకు 100 మందికి కూడా ధాన్యం లిఫ్టింగ్ జరగలేదని తెలిపారు. సుమారు 17 వేల క్వింటాళ్ల ధాన్యం తరలించినట్లు పేర్కొన్నారు. కొంతమంది రైతుల వద్ద 10 క్వింటాళ్ల వరకు కోత వేయడం అన్యాయమని వాపోయారు.ముషంపల్లి కేంద్రంలో రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించలేని పరిస్థితి ఏర్పడిందని, ట్రక్ షీట్స్ కూడా సరిగా నమోదు చేయడం లేదని చెప్పారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నదని, రైతులు తీవ్ర నష్టపోతున్నారని తెలిపారు.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్ల దోపిడిని అరికట్టాలని, అమ్మిన ధాన్యానికి రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఉప్పుల గోపాలు, మాజీ ఎంపీటీసీ రూపని లింగయ్య, సిపిఎం కార్యదర్శి గంగుల యాదయ్య, కొడదల బిక్షమయ్య, పాలడుగు ఎల్లయ్య, చిలుముల వెంకన్న, కొంచెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

